క్లుప్తంగా

విద్యుత్ స్తంభం ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

గార్ల: 'ఇనుప స్తంభానికి విద్యుత్ సరఫరా' అనే శీర్షికన 3 రోజుల క్రితం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు సోమవారం స్పందించారు. గార్ల విద్యుత్ ఏఈ మహేంద్ర బాబు స్పందించి సోమవారం గోపాలపురం గ్రామంలో విద్యుత్ సిబ్బందిచే ఇనుప విద్యుత్ స్తంభాన్ని తొలగించి అదే స్థానంలో సిమెంట్ విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు.

యువకుల శ్రమదానం



గార్ల: మండలంలోని సీతంపేట గ్రామ సమీపంలో బీటీ రహదారిపై సోమవారం గాలి దుమారానికి చెట్టు విరిగి రహదారికి అడ్డంగా పడిపోయింది. దీంతో రహదారికి ఇరువైపుల వాహనాలు నిలిచిపోవడంతో సీతంపేట యువకులు శ్రమదానం ద్వారా రహదారిపై ఉన్న చెట్టును తొలగించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



గార్ల: రాష్ట్ర వైద్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా ఇటీవల వైద్యరత్న అవార్డు అందుకున్న గార్ల సీహెచ్‌సీ డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్‌ను సోమవారం గార్లలో వర్తక సంఘం వ్యాపారులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వర్తకసంఘం అధ్యక్షుడు మహేందర్‌జైన్, కార్యదర్శి మహవీర్‌జైన్, సభ్యులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణం..

మరిపెడ: మరిపెడ రామాలయంలో రాములోరి కల్యాణ వేడుక మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా 27 నక్షత్రాలకు ప్రత్యేక పూజలు జరిపించారు. కిసాన్ పరివార్ చైర్మన్, ఫౌండర్ నూనావత్ భూపాల్‌నాయక్ హైదరాబాద్ వారి సహకారంతో కల్యాణ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అచ్చుత్‌రావు, సచిన్ పాల్గొన్నారు.

అధ్యక్షురాలిగా విజయ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా దండి విజయను నియమించామని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ సోమవారం తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు చీరిక ఉపేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బెల్లంకొండ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు శిక్షణ దోహదం

మహబూబాబాద్ అర్బన్: మహిళల స్వావలంబనకు ఉపాధి శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని టౌన్ సీఐ సతీష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వేల్పుల సత్యం నగర్‌లో ఎఫ్‌ఎంఎం సహకారంతో సోమవారం దైవ కృప వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి మగ్గం శిక్షణ మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ నాగవాణి, ప్రాజెక్టు ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు, ఎఫ్‌ఎంఎం బాధ్యులు పాల్గొన్నారు.

సహకరించాలి



కురవి: కురవి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, రాజకీయ నాయకులు, పార్టీలకు అతీతంగా పోలీసులకు సహకరించాలని మహబూబాబాద్ డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ కోరారు. సోమవారం కురవి పోలీస్ స్టేషన్‌లో అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో శాంతిభద్రతలను నెలకొల్పేందుకు సహకరించాలన్నారు. యువకులు లేనిపోని గొడవలకు పోయి భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ రూరల్ సీఐ రమేష్, ఎస్సై గోపి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఆటో బోల్తా

చిన్నగూడూరు: మండలంలోని చిన్నతేజతండాకు చెందిన ఒకే కుటుంబ సభ్యులు దేవాలయంలో నిద్ర కోసం కురవికి బయలుదేరుతున్న క్రమంలో జయ్యారం శివారు చెరువు కట్ట వద్ద ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పింది. ఈప్రమాదంలో గుగులోతు విజయ, మంగమ్మ, మంగ్యా, లక్కీ, అశ్విత్, దేవిక, సురేష్, వీరన్నలకు స్వల్ప గాయాలు కాగా కేస్లీ చెయ్యికి, నిఖిత అనే బాలిక తలకు గాయాలయ్యాయి. వారిని వెంటనే జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● కొనసాగుతున్న సమ్మె



డోర్నకల్: సమ్మెకు మద్దతు తెలుపుతున్న నెహ్రూనాయక్



కేసముద్రం: కార్మికుల దీక్షలో మాట్లాడుతున్న మురళీనాయక్



మహబూబాబాద్ రూరల్: భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

డోర్నకల్: గ్రామాల్లో వెట్టి చాకిరి చేస్తూ తమ హక్కులపై పోరాడుతున్న వారిపై ప్రభుత్వం జాలి చూపకపోవడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు మాలోత్ నెహ్రూనాయక్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన దీక్షలు సోమవారం 12వ రోజుకు చేరుకున్నాయి. దీక్షకు నెహ్రూనాయక్ మద్దతు తెలిపాడు. పార్టీ మండల అధ్యక్షులు దరంసోత్ జగదీష్, నాయకులు తారాచంద్, అనంతుల ఉపేందర్‌గౌడ్, లాలూనాయక్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల భిక్షాటన

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు భిక్షాటన చేసి తమ నిరసన తెలియజేశారు.

కురవి: మండల కేంద్రంలో సమ్మెకు సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య సంఘీభావం తెలిపాడు. కార్యక్రమంలో నాయకులు ఉపేంద్రాచారి, మంజూర్ అలీ పాల్గొన్నారు.

కేసముద్రం: జీపీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జీపీ కార్మికుల దీక్షా శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, కేసముద్రం పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

నెల్లికుదురు: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెకు కేవీపీఎస్‌తోపాటు వివిధ పార్టీల నాయకులు సోమవారం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఇస్సంపెల్లి సైదులు, జీపీ కార్మికులు రాములు, రవి, ఎల్లయ్య పాల్గొన్నారు.

తొర్రూరు: గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు మంగపల్లి ప్రసాద్ అన్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగమూర్తి, సోమనర్సయ్య, యాకన్న, శ్రీనివాస్, రాంరెడ్డి, రమేష్, గౌస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తేనే పెన్షనా..



మాట్లాడుతున్న కవిత

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే తప్ప పెన్షన్ రాదని, ఈ విధానం సహేతుకంగా ఉందని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ.. వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి, ఐఆర్ ప్రకటించాలని, కోర్టులో పెండింగ్‌లో ఉన్న బదిలీలు, ప్రమోషన్ల కేసును ఎత్తివేసి బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఆర్థిక సామాజిక భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు వినోద్ రెడ్డి, గోవర్ధన్, సదానందం, సభ్యులు శ్రీనివాస్, ఐలయ్య, పాషా, రమేష్, సువర్ణ, అలీ, విష్ణువర్ధన్, బాబా పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు ప్రారంభం

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో నుంచి నూతనంగా బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు డిపో మేనేజర్ జే.విజయ్ సోమవారం తెలిపారు. మహబూబాబాద్ డిపో నుంచి పల్లె వెలుగు ఉదయం 9 గంటలకు బయల్దేరి గూడూరు నుంచి మట్వాడకు వెళ్తుందన్నారు. మరో సర్వీసు డిపో నుంచి ఉదయం 8.45కు బయల్దేరి పెనుగొండ మీదుగా గూడూరుకు కొత్త సర్వీసులను నడిస్తున్నామన్నారు. అదే విధంగా మహబూబాబాద్ డిపో నుంచి 6 గంటలకు బయల్దేరి రాజులకొత్తపల్లి, తార్‌సింగ్‌బాయి, నెల్లికుదురుకు చేరుకొని తిరిగి సాయంత్రం 5.20 సాయంత్రం అదే రూట్‌లో మానుకోటకు 6.45 గంటలకు చేరుకుంటుందన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిన్నగూడూరు: సీఎం సహాయనిధి పేదప్రజలకు వరంలాంటిదని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని ఉగ్గంపల్లిలో సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అయూబ్‌పాషా, వల్లూరి వెంకట్ రెడ్డి, ధారాసింగ్, సురేష్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సమస్యల పరిష్కారం



నెల్లికుదురు: ప్రచారం చేస్తున్న మురళీనాయక్

నెల్లికుదురు: నిరుపేద ప్రజల సమస్యలు పరిష్కారం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ అన్నారు. మండలంలోని నల్లగుట్ట తండా, జామతండాలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం ఆయన గడపగడపకు పర్యటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని సత్యపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి, వివిద గ్రామాల నాయకులు పెరుమాండ్ల మల్లేశం, ఇట్టే దేవేందర్‌రెడ్డి, బాలాజి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

గూడూరు: రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని సోమవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉచిత కరెంట్ అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ సమావేశంలో కత్తి స్వామి, యాకుబ్‌పాష, బీరం శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దచెరువు, కాల్వలను అభివృద్ధి చేయాలి



కాల్వను పరిశీలిస్తున్న నాయకులు

బయ్యారం: బయ్యారం పెద్దచెరువు, కాల్వలను అభివృద్ధి చేయాలని అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేపడతామని పలుపార్టీల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం అఖిలపక్ష పార్టీల నాయకులు బయ్యారం పెద్దచెరువు, కాల్వలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు నీటిని బయ్యారం పెద్దచెరువులోకి తీసుకొస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. చెరువును అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ జిల్లా మంత్రి, జెడ్పీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే స్పందించకపోవటం సరికాదన్నారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీలోని ఇరువర్గాలు, ప్రజాపంథా, కాంగ్రెస్, సీపీఎం, టీడీపీ, సీపీఐ, ప్రతిఘటన పార్టీల నాయకులు వెంకటేశ్వర్లు, వీరభద్రం, జగ్గన్న, ముసలయ్య, రాజన్న, బాబురావు, కళింగరెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల్లో అన్నదానం గొప్పది




అన్నదానం చేస్తున్న గోశాల ప్రతినిధులు

పెద్దవంగర: ఆకలితో ఉన్న వారికి అన్నం వితరణ చేయడం గొప్పదని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కిరణ్ అన్నారు. సోమవారం మండలంలోని అవుతాపురం గ్రామంలో 300మందికి మహేశ్వరి గోశాల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు. టీజీఎఫ్ స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ జన్మదినం వేడుకల్లో భాగంగా అన్నదానం కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రం వ్యాప్తంగా గోవులను పూజించడం, పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు, రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందజేస్తున్నట్లు కిరణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సల్దెండి మంజుల టీజీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, జనగామ, వరంగల్, హనుమకొండ అధ్యక్షులు గణేష్, యాకు, భాస్కర్, ప్రతినిధులు అశోక్, దేవేందర్, రమేష్, నరేష్, చందులాల్, సుమన్, అజ్మీర్ పాల్గొన్నారు.


అక్రమ అరెస్టులను ఖండించాలి

కురవి: ఎల్‌హెచ్‌పీఎస్ యువజన అధ్యక్షుడు బానోత్ రమేష్‌నాయక్‌ను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని సంఘం రాష్ట్ర నాయకులు గుగులోత్ బీమానాయక్, వినోద్ నాయక్, విష్ణునాయక్, మంగీలాల్‌నాయక్‌లు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పర్యటన నేపథ్యంలో కురవి పోలీసులు రమేష్‌ను అరెస్టు చేయడం అన్యాయమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను ఓడించడం ఖాయమని తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక



శివ, అధ్యక్షుడు



వెంకటేష్, ప్రధాన కార్యదర్శి

గార్ల: ఏఐవైఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం గార్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా ఎస్.శివ, ప్రధాన కార్యదర్శిగా ఇరుగు వెంకటేష్‌లతోపాటు మండల కౌన్సిల్ సభ్యులుగా బి.వెంకటేష్, ఉపేందర్‌రెడ్డి, లాలూప్రసాద్, రాంబాబు, మోహన్, వేణు, సాయిలను ఎన్నుకున్నారు.

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా

పెద్దవంగర: ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు సేవలను యువత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ద్వారా అందజేస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కోసం మేళా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడారు. ఈ నెల 18 నుంచి మేళా ప్రారంభం కాగా 31 వరకు కొనసాగుతుందని తెలిపారు. సంబంధిత జిరాక్స్ పత్రాలను ట్రస్టు ప్రతినిధులకు అందజేయాలన్నారు. వివరాలకు 99495 92664,99593 13959, 96662 77001 సంప్రదించాలని తెలిపారు.

రైతుల జోలికి వస్తే పుట్టగతులుండవు

● ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



మహబూబాబాద్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్/కేసముద్రం/గూడూరు: రైతుల జోలికి వస్తే కాంగ్రెస్‌కు పుట్టగతులుండవని, రాబోయో ఎన్నికల్లో పార్టీకి రైతులు తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైతువేదికలో మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం 24గంటల ఉచిత కరెంట్‌తోపాటు రైతుబంధు, రైతు బీమాతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబునాయుడు ఉన్న సమయంలో వ్యవసాయయే దండగ అన్నారని ఇంకా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చంద్రబాబు శిష్యరికంలో పని చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ సీఎం అభ్యర్థి ఎవ్వరో తెల్చుకోలేని స్థితిలో ఉందన్నారు. మానుకోటలో కాంగ్రెస్ నుంచి ముగ్గురు ఎమ్మెల్యే అభ్యర్థులుగా తిరుతున్నారని అది ఆ పార్టీ పరిస్థితి అన్నారు. ఉచిత కరెంటుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే కేసీఆర్‌ను మరోసారి సీఎం చేస్తారన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ ప్రియాంక, మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండా రాజశేఖర్, నాయకులు శ్రీనివాస్, జనార్దన్, సుధగాని మురళి, కేసముద్రంలో జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్ రెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ మర్రి రంగారావు, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, నాయకులు దుర్గేష్, నజీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి



మంత్రికి బొకే అందజేస్తున్న నాయకులు

పెద్దవంగర: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం హనుమకొండలోని విశ్రాంతి భవనంలో ఆయనను మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలను విన్నవించారు. అనంతరం మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. రాష్ట్రంలో నియోజకవర్గాన్ని అన్ని నియోజకవర్గాల కంటే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్య శర్మ, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు సోమారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, నాయకులు యాదగిరి, శ్రీనివాస్, వెంకన్న, రాజు యాదవ్, సుధీర్, సుధాకర్, సమ్మయ్య, జ్ఞానేశ్వరచారి, వెంకటరామయ్య, సర్పంచ్ పటేల్ నాయక్, ఎంపీటీసీ రవీందర్ నాయక్, మల్లికార్జున చారి, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథం.. భవిష్యత్ తరాలకు ఆదర్శం



తొర్రూరు రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్/తొర్రూరు రూరల్: నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించి తన తుదిశ్వాస వరకు పేదల పక్షాన పోరాడిన పెరుమాండ్ల జగన్నాథం సేవలు భవిష్యత్ తరాలకు ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గునిగంటి రాజన్న, సూర్నపు సోమయ్య, తొర్రూరు, నెల్లికుదురు మండలాల పార్టీ కార్యదర్శులు ఎండీ యాకుబ్, పెరుమాండ్ల తిలక్‌బాబుఅన్నారు. పెరుమాండ్ల జగన్నాథం వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, రాజు, ఉపేందర్, శ్రీనివాస్‌రెడ్డి రాజు, సాయిమల్లు, రామ్మూర్తి, సోమిరెడ్డి, వెంకటేశ్వర్లు, యాకయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గృహహింస కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఓ తండాకు చెందిన ఓ వివాహితను ఆమె భర్త అదనపు కట్నం కోసం వేధించగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్తపై గృహహింస చట్టం కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్సై రాంచరణ్ సోమవారం తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

మరిపెడ రూరల్: మండలంలోని చిల్లంచర్ల రెవెన్యూ పరిధిలోని మల్లంకుంట గ్రామ పంచాతీకి చెందిన అజ్మీర భారతి (45) చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మల్లంకుంట తండాకు చెందిన అజ్మీర భారతి కుటుంబ కలహాలతో తీవ్ర మనస్థాపానికి గురై వారం రోజుల క్రితం ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతు రాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ ప్రగఢ సానుభూతిని వ్యక్తం చేశాడు. మృతురాలు భారతి అదే తండాలో గతంలో జరిగిన ఓ మర్డర్ కేసులో నిందితురాలిగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

దంతాలపల్లి: మండలంలోని తూర్పు తండాకు చెందిన గుగులోత్ సురేందర్ రోడ్డుపై పైపు వేసి తన పంట పొలానికి నీళ్లు పారిస్తున్నాడు. అదే సమయంలో మండలంలోని రామవారం గ్రామానికి చెందిన చాపల రాజేష్ కారు పైపు నుంచి వెళ్లడంతో పైపు పగిలింది. దీంతో రాజేష్‌పై సురేందర్ దాడి చేశాడు. రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ తెలిపాడు.

పరామర్శ

కురవి: మండలంలోని రున్వాల్ మోహన్‌సింగ్ అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు మాలోత్ నెహ్రూనాయక్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఆర్థికసాయం

నెల్లికుదురు: మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన మాదరి వర్శిత్, వర్శితకు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. వరంగల్ ట్రాన్స్‌కో ఏఈ దార్ల శివకృష్ణ, ఆయన సోదరుడు హైదరాబాద్ గంటిపేటలో ఎస్సైగా పనిచేస్తున్న దార్ల శ్రీనివాస్ గ్రామానికి వచ్చి సోమవారం ఆర్థిక సాయం అందించి పిల్లలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ డొనికెన జ్యోతి, వార్డు సభ్యుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల అడ్డగింత

గార్ల: మండలంలోని మర్రిగూడెం పంచాయతీలో అధికారులు బయట కూలీలను పెట్టుకొని పారిశుద్ధ్య పనులు చేయిస్తుండగా, సోమవారం సమ్మెలో ఉన్న పంచాయతీ కార్మికులు పనులను అడ్డుకొని కూలీలను ఇళ్లకు పంపించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ్ల అప్పిరెడ్డి, కార్మికులు భద్రునాయక్, దస్తగిరి, కిషన్, దాసు, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీని గెలిపిస్తాం..

దంతాలపల్లి: వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపిస్తామని మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు. సోమవారం మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో సీనియర్ నాయకులు గుండెం రాంనర్సయ్య ఆధ్వర్యంలో గ్రామ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ జిల్లా సెక్రటరీ ఐనాల పరశురాములు, జిల్లా ఈసీ మెంబర్ ఎడ్ల శ్రీనివాస్, నియోజకవర్గ మహిళా విభాగం కన్వీనర్ పార్వతి రమేష్ నాయక్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలిచేది బీఆర్‌ఎస్సే

మరిపెడ రూరల్: కాంగ్రెస్, బీజేపీ ప్రతి పక్ష పార్టీలు ఎన్ని లాజిక్‌లు, మ్యాజికల్‌లు చేసిన వచ్చే ఎన్నికల్లో గెలిచేది బీఆర్‌ఎస్ అని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు భూక్యా ప్రవీణ్‌నాయక్ అన్నారు. మండలంలోని దంట్లకుంటతండా గ్రామ పంచాయతీలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నాడన్నారు. సమావేశంలో నాయకులు సాగర్, శశి, విజయ్, కుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలి

మరిపెడ: దివ్యాంగులను అన్నివిధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని సంఘం మండల అధ్యక్షుడు బానోతు శివ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు డబుల్ బెడ్రూంలు, నెలకు రూ.6వేలు పింఛన్, జీవనోపాధికి బ్యాంక్ రుణాలు ఇప్పించాలన్నారు. సమావేశంలో బోడ ధర్మ, ఆంగోతు రవికుమార్, జాటోతు లాలు, బిక్షం, నాగన్న పాల్గొన్నారు.

'డబుల్ బెడ్రూం'లు ఇవ్వాలి

మరిపెడ: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూంలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానాల రాజన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. అనంతచారి, దేవయ్య, ఉప్పలయ్య తదితరులున్నారు.

వైద్యశిబిరం

చిన్నగూడూరు: మండలంలోని విస్సంపల్లి గ్రామంలో ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ విద్యులత, సూపర్వైజర్స్ వెంకటేశ్వర్లు, రాధాకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ సుమలత, ఏఎన్‌ఎం భారతి, హెల్త్ అసిస్టెంట్ వీరయ్య, ఆశాలు పాల్గొన్నారు.

రథయాత్రను విజయవంతం చేయాలి

బయ్యారం: పాత పెన్షన్‌విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈనెల 20 న టీఎస్‌సీపీఎస్ ఈయూ ఆధ్వర్యంలో మండలంలో నిర్వహించనున్న సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు బానోత్ రవీందర్ నాయక్ సోమవారం పిలుపునిచ్చారు. సంఘాల నాయకులు శ్రీకాంత్, వెంకన్న, రమణమ్మ, రామారావు, మీరా, కృష్ణ, రవి పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులు నిలిపివేయాలి

డోర్నకల్: స్థానిక బిషప్ అజరయ్య ఫంక్షన్ సమీపం నుంచి సుభాష్‌వీధి వరకు రైల్వే స్థలంలో రైల్వే స్థల హద్దును నిర్ధారిస్తూ చేపట్టిన సైడు కాల్వ, గోడ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పునాదులు తవ్విన ప్రాంతంలోని బిషప్ ఆస్పత్రి, ఫంక్షన్‌హాలుతోపాటు కొన్ని ఇళ్లకు రోడ్డుపైకి వచ్చే మార్గం మూసుకుపోయిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శీలం భాగ్యలక్ష్మిశ్రీనివాస్, బసిక అశోక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్ పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఆశ్రమ పాఠశాల్లో హాస్టళ్లలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడు హెచ్. వెంకటేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను సోమవారం నాయకులు సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, సాయి, చందర్, నరేష్, వెంకన్న, శేఖర్, పవన్ పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి



గార్ల: ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో రౌడీషీటర్లు నేరాలకు పాల్పడితే, అట్టి వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై బానోత్ వెంకన్న హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు సహకరిస్తూ, ప్రజలతో సోదరభావంతో మెలగాలని సూచించారు.

మంచి ప్రవర్తనతో మెలగాలి

గూడూరు: రౌడీషీటర్లు మంచి ప్రవర్తనతో మెలగాలని ఎస్సై రాణాప్రతాప్ సూచించారు. మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు.